క్షీణించిన పారిశుధ్యం

- 58వ వార్డులో పేరుకుపోయిన వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న కాలనీల వాసులు

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డులో పారిశుధ్యం క్షీణించింది. పేరుకుపోయిన వ్యర్థాల కారణంగా దుర్గంధం వెదజల్లుతోంది. పిలకవానిపాలెంలోని గెడ్డలో గత వారం నుంచి వ్యర్థాలు పేరుకుపోయాయి. సకాలంలో పారిశుధ్య సిబ్బంది తొలగించకపోవడంతో పందులు, వీధి కుక్కలు అక్కడికి చేరి గెడ్డలో ఉన్న వ్యర్థాలను బయటకు తీస్తూ పరిసరాలను అధ్వానంగా తయారు చేస్తున్నాయి. గెడ్డను ఆనుకుని ఉన్న నివాసితులు దుర్గంధంతో చాలా ఇబ్బంది పడుతున్నారు.

- ములగాడ గ్రామంలోని వీధి కాలువలు కూడా వ్యర్థాలతో నిండిపోయాయి. ఎప్పటికప్పుడు చెత్త తరలించపోవడంతో ఆయా ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. నిత్యం ఇంటి తలుపులు వేసుకుని ఉండాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీహరిపురం, గుల్లలపాలెం పరిసర ప్రాంతాల్లోని కాలువలు, గెడ్డలు కూడా వ్యర్థాలమయమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.


పిలకవానిపాలెం గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు


ములగాడ వీధి కాలువలో వ్యర్థాలు

క్లుప్తంగా

నేవీ చిల్డ్రన్ స్కూల్‌లో వైద్య పరీక్షలు


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

సింధియా : విశాఖపట్నంలోని నేవీ చిల్డ్రన్స్ స్కూల్ విద్యార్థులకు గోపబంధు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ హాస్పిటల్ సహకారంతో వార్షిక వైద్య పరీక్షలు గురువారం నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలు ముందస్తుగా గుర్తించడంతోపాటు వారికి అవసరమైన సూచనలు అందించడమే లక్ష్యంగా పరీక్షలు నిర్వహించినట్లు నేవీ వర్గాలు తెలిపాయి. 17 మంది వైద్యులతో కూడిన ప్రత్యేక బృందం సుమారు 3 వేల మంది ఎన్‌సీఎస్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారందరికీ హెల్త్ కార్డులు జారీ చేశారు.

వుడా లే అవుట్ సమస్యలు పరిష్కరిస్తాం

విశాఖ విద్య : మద్రిపాలెం వుడా లే అవుట్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గురువారం కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పార్కులోని సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గణబాబు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు, స్థానిక మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం


తుంగ్లాంలో సంబరాలు నిర్వహిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ప్రకటించడంతో ఎస్సీ సామాజిక వర్గాల నేతలు గురువారం ఉత్సవాలను నిర్వహించి, తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు పెట్ల అర్జునరావు, కార్యదర్శి పెట్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పెట్ల అప్పారావు, కార్యనిర్వాహక కార్యదర్శి చెవ్వేటి సూర్యనారాయణ, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెట్ల వెంకటరమణ, జిల్లా ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్షుడు ఈతలపాక మంగరాజు, జగ్జీవన్ రాం యూత్ ప్రతినిధులు, సంఘం సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కంటి శుక్లాలపై అశ్రద్ధ తగదు

ఆరిలోవ: కంటిపై ఏర్పడే శుక్లాలను అశ్రద్ధ చేయకూడదని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ శిల్పా తరణి తెలిపారు. హనుమంతవాక వద్ద ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో గురువారం కంటి వ్యాధితో బాధపడుతున్న వారికి ఆమె అవగాహన కల్పించారు. కంటి శుక్లాలను అశ్రద్ధ చేయడం వల్ల అంధత్వం వస్తుందన్నారు. జన్యుపరమైన, జీవక్రియ లోపాలు, ఇన్‌ఫెక్షన్, గాయం వల్ల కంటి శుక్లాలకు గురవుతుంటారన్నారు. కంటిలో తెల్ల మచ్చ కనిపించడం, మెల్ల కన్ను, కనుబొమ్మలు వనకడం వంటివి కంటి శుక్లాల లక్షణాలని తెలిపారు. కంటికి ఎలాంటి సమస్య వచ్చినా వైద్యులు పర్యవేక్షణ లేకుండా మందులు వాడకూడదన్నారు. మధుమేహం, గ్లకోమా, మూత్ర పిండాల వ్యాధి, కంటి గాయాలు, కంటి లోపల మంట తదితర వాటి ప్రభావం వల్ల కంటిలో శుక్లాలు ఏర్పడడానికి అవకాశం ఉందన్నారు. స్టెరాయిడ్స్ వాడటం, ధూమపానం, పొగాకు నమలడం వల్ల కూడా కంటి శుక్లాలు రావడానికి అవకాశం ఉందన్నారు. కంటి శుక్లాలు ఉన్నవారు శస్త్ర చికిత్స చేసుకోవడం మంచిదన్నారు.

జోన్–5లో పింఛన్ల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో గురువారం సుమారు 97.11 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జోన్ పరిధిలోని 24 వార్డులకు సంబంధించి మొత్తం 27,273 మంది పింఛన్‌దారులు ఉండగా.. తొలిరోజు 26,589 మందికి పెన్షన్లు అందజేశామన్నారు. రూ 11.84 కోట్ల నగదుకు గాను రూ.10.85 కోట్లను లబ్ధిదారులకు అందించామని చెప్పారు. శుక్రవారం నాటికి 100 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, సచివాలయ సిబ్బందికి జెడ్సీ కృష్ణ ఆదేశించారు. టీపీఆర్వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో లబ్ధిదారులకు ఇళ్ల వద్ద పింఛన్ సొమ్ము అందజేశారు.

పింఛన్లు అందజేసిన జీవీఎంసీ కమిషనర్

జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయ పరిధిలో చేపట్టిన పింఛన్ల పంపిణీని అధికారులతో కలిసి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పర్యవేక్షించారు. పెన్షన్ల పంపిణీలో నిర్లక్ష్యం వద్దని అధికారులు, సిబ్బందికి సూచించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కమిషనర్ చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు. ఏపీడీవోలు పద్మావతి, చిరంజీవి, జోనల్ అధికారులు పాల్గొన్నారు.


కార్యాలయ సమీపంలో పింఛన్ అందిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

వ్యక్తి అదృశ్యం


శంకరరావు

గోపాలపట్నం : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ 5వ వార్డు మద్రిపాలెం హౌస్సెన్‌నగర్‌లో నివసిస్తున్న ఎన్ని శంకరరావు పాన్‌షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. జులై 21న ఇంటి నుంచి వెళ్లిన శంకరరావు ఎంతకీ ఇంటికి చేరకపోవడంతో అతని భార్య శాంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పులు ఎక్కువగా ఉండడంతో, ఒత్తిడి తట్టుకోలేక మనస్తాపంతో వెళ్లిపోయి వుంటాడని స్థానికులు చెబుతున్నారు. సీఐ చక్రధరరావు పర్యవేక్షణలో హెచ్‌సీ రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ప్రారంభం

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో శతాబ్దం నుంచి నిర్వహిస్తున్న దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ నేతృత్వంలో దివ్య బలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరియమాత ఏ విధంగా లోకానికి తల్లిగా మారిందో విశదీకరించారు. ముందుగా శిలువ గుర్తు వీధిలో దేవమాత పతాకాన్ని పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం సెబాస్టియన్ కాలనీ, బిషప్ మరియదాస్ కాలనీ, రావులపల్లి, వడిచర్ల, నికోలస్, దయాస్, రాసా వీధుల్లో తేరును ఊరేగించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు వినయ్‌కుమార్, ఆంథోనీ రాజ్, ఆంధ్రా క్యాథలిక్ యూనియన్ ప్రెసిడెంట్ బూర శేషుబాబు, పీపీసీ సభ్యులు పి.ఫ్రాన్సిస్, జి.ఆనందరావు, నిర్మల రాజు, రత్నం, గురు మండలి సలహా సంఘం ప్రతినిధులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.


తేరు స్వరూపాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

జీతాల కోసం స్టీల్‌ప్లాంట్ యువ కార్మికుల ధర్నా

ఉక్కునగరం: ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు డిమాండ్ చేశారు. ఉక్కు అడ్మిన్ విభాగం వద్ద గురువారం ధర్నా చేశారు. జీతాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యువ కార్మికులు మాట్లాడుతూ ప్రతీ నెలా జీతాల కోసం యాజమాన్యాన్ని అడుక్కునే పరిస్థితి రావడం దుర్మార్గమన్నారు. సకాలంలో జీతాలు ఇప్పించడంలో కార్మిక సంఘాలు విఫలమయ్యాయన్నారు. జీతాలు చెల్లించే వరకు ప్రతీ రోజూ అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యువ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అణ్వస్త్ర రహిత సమాజంతో శాంతి సాధ్యం

ఎంవీపీ కాలనీ: అణ్వస్త్రాల రహిత సమాజంతోనే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం చైర్మన్ నరవ ప్రకాశరావు అన్నారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు 1945లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అణుబాంబు దాడులను పురస్కరించుకుని సంస్మరణ సభలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావుతో కలిసి ఈ సంస్మరణ సభల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ప్రపంచ శాంతిని కాంక్షించే ప్రతి ఒక్కరూ 6న వీఎస్ కృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగే సంస్మరణ సభకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాశాల ఉద్యోగులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- డీసీపీ–2 తుహిన్ సిన్హా
- దువ్వాడ పీఎస్ ఆకస్మిక తనిఖీ

అగనంపూడి: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నగర డీసీపీ–2 తుహిన్ సిన్హా ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దాలని, నేరాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దువ్వాడ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన అక్కడి సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి, కేసులపై ఆరా తీశారు. సమస్యాత్మక ప్రాంతాల వివరాలపై వాకబు చేశారు. అనంతరం అగనంపూడి సెక్టార్లలో కలియ తిరిగారు. అక్కడ ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. కూర్మన్నపాలెం, వడ్లపూడి, దువ్వాడ, మంగళపాలెంతో పాటు దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో భూ వివాదాలు లేకుండా చూడాలని, అధికంగా నేరాలు జరిగే ప్రాంతాల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. ఆయన వెంట దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు ఉన్నారు.


దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, కేసుల వివరాలు పరిశీలిస్తున్న డీసీపీ–2 తుహిన్ సిన్హా

తాళం వేసి ఉన్న ఇంట్లో అపహరణ

- బీరువాలో బంగారం, నగదు చోరీ

అక్కిరెడ్డిపాలెం: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి, బీరువాలోని బంగారు, వెండి వస్తువులను చోరీ చేశారు. ఘటనకు సంబంధించి గాజువాక క్రైం ఎస్‌ఐ మన్మథరావు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జీవీఎంసీ 68వ వార్డు మింది స్టూడియో లైన్‌లోని తమ సొంత ఇంట్లో జింక్ విశ్రాంత ఉద్యోగి ఈటి వెంకటరావు, రాజ్యలక్ష్మి నివసిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు నాగశరత్ సంతు విజయవాడలోని ఫైబర్ నెట్‌లో జీఎంగా పని చేస్తున్నారు. వెంకట్రావు దంపతులు ఈ నెల 27న ఇంటికి తాళం వేసి విజయవాడలోని కుమారుడి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం ఇంటి ముందు శుభ్రం చేయడానికి వచ్చిన పనిమనిషి ముందు డోరు తాళాలు విరగ్గొట్టి ఉండటాన్ని గమనించి, ఇంటి పక్కవారితో పాటు నగరంలోనే ఉంటున్న వెంకట్రావు కుమార్తె సరితకు సమాచారం అందించింది. వెంటనే వచ్చిన సరిత గాజువాక క్రైం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బుధవారం అర్ధరాత్రి దొంగలు ముందు తలుపు తాళం విరగ్గొట్టి, లోపలికి ప్రవేశించి, వెనుక డోర్ నుంచి వెళ్లినట్లు గుర్తించారు. బెడ్‌రూమ్‌లోని బీరువాను, లాకర్ తెరిచి సుమారు రెండున్నర తులాల బంగారం, 30 తులాల వరకు వెండి, రెండు ఖరీదైన రిస్ట్ వాచ్‌లు, కొంత నగదు దొంగిలించినట్లు వెంకట్రావు కుమార్తె సరిత ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రైం డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ శ్యామలరావు, సౌత్ ఏసీపీ త్రినాథ్, గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ మన్మథరావు తెలిపారు.


తలుపులను వంచేసి తెరిచిన బీరువా


బీరువా నుంచి తీసిన వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం

అధినేతతో ఆత్మీయ కలయిక


వైఎస్ జగన్‌తో 61వ వార్డు కార్పొరేటర్ సుధ, వార్డు ముఖ్య నాయకులు


వైఎస్ జగన్‌కు జ్ఞాపిక అందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్


వైఎస్ జగన్‌తో ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్ యాదవ్

మల్కాపురం : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ముఖ్య నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో 59, 60, 61, 62, 40వ వార్డుల కార్పొరేటర్లు పుర్రె పూర్ణశ్రీ, పి.వి.సురేష్, కొణతాల సుధ, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావుతో పాటు ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, నాయకులు దాడి సత్యనారాయణ, చట్టి నూకరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ విద్య: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని విశాఖ నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖ నగరపాలక సంస్థ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్ పాల్గొన్నారు. ఇదే క్రమంలో వైఎస్ జగన్‌ను కలిసి కండువాతో సత్కరించి చిరు జ్ఞాపిక అందజేశారు. విశాఖలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికపై పార్టీ అధినేతతో చర్చించినట్టు శ్రీధర్ తెలిపారు.

విద్యతో పాటు ఇండస్ట్రియల్ నాలెడ్జ్ అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామానాయుడు


కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల చైర్మన్ సత్యనారాయణ, విభాగాధిపతులు, అధ్యాపకులు

గోపాలపట్నం: విద్యార్థులకు విద్యతో పాటు ఇండస్ట్రియల్ నాలెడ్జ్ పెంపొందించడం చాలా అవసరమని ఇందిరా గాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఫర్ ఉమెన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రామనాయుడు అన్నారు. నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనా పద్ధతులను వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, పైథాన్ కోర్సులపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రదీప్ వర్మ, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రిగెడ్డపై రక్షణ చర్యలు చేపట్టాలి

కంచరపాలెం : జ్ఞానాపురం ఎర్రిగెడ్డపై యుద్ధప్రాతిపాదికన రక్షణ చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. 41వ వార్డు జ్ఞానాపురంలో గురువారం జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణతో కలిసి ఆయన ఎర్రిగెడ్డను పరిశీలించారు. కాలువలో పూడికలు తొలగించి మురుగు సాఫీగా పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. జ్ఞానాపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షపు నీరు చేరుతున్నందున శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాలరావును ఆదేశించారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–5 ఈఈలు మత్స్యరాజు, తారా ప్రసన్నరెడ్డి, రెవెన్యూ అధికారి (ఆర్వో) బాబూరావు, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునీల్‌కుమార్, ఏసీపీ వెంకటరావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


ఎర్రిగెడ్డను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

ఔషధ మొక్కల పెంపకం ఆరోగ్యానికి మేలు

మద్దిలపాలెం: ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలను పెంచడం వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల ప్రాంగణంలో గురువారం గ్రీన్ క్లైమేట్, వనమాలి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో జీవన వైవిధ్య వనం పెంచుదామని, ఇందుకు విద్యార్థుల సహాయ, సహకారాలు ఎంతో అవసరమన్నారు. భవిష్యత్ తరాల కోసం సామాజిక వనాలు పెంచాలన్నారు. ఆరోగ్యంగా ఉండడానికి ప్రకృతి ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేశీయ విత్తనాల నిధిని ఏర్పాటు చేయడానికి గ్రీన్ క్లైమేట్, వనమాలి స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయమన్నారు. మొక్కలు పెంచడం ద్వారా పక్షులు గూళ్ల పెట్టుకుని వాటి మనుగడ సాధిస్తాయన్నారు. ఆకు కూరల పెంపకాన్ని ఇంటి పెరట్లో చేపడడం ద్వారా తాజా ఆర్గానిక్ ఆకుకూరలు తినేందుకు వీలు కలుగుతుందన్నారు.


కృష్ణా కళాశాల ప్రాంగణంలో ఔషధ మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

సమస్యలే తిలక్ సాహిత్య ఇతివృత్తాలు

బీచ్ రోడ్డు: సామాజిక సమస్యలపై దేవరకొండ బాలగంగాధర్ తిలక్ తన సాహిత్యంలో ప్రస్తావించారని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో దేవరకొండ బాలగంగాధర్ తిలక్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జె.అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా తిలక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా నరసింహారావు మాట్లాడుతూ తిలక్ సమాజ మార్పు కోసం పేదరికం, భూస్వామ్యం, నియంతృత్వ పోకడలు ఇలాంటి సమస్యలను తన సాహిత్యంలో ప్రస్తావించారన్నారు. భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా డి.ప్రవీణ మాట్లాడుతూ తిలక్‌కు చిన్ననాటి నుంచి సాహిత్య అభిలాష ఎక్కువని, తన కథలు, కవిత్వంలో ప్రతీ అంశాన్ని తిలక్ స్పృశించారని కొనియాడారు. ఆత్మీయ అతిథి జి.యోహానుబాబు మాట్లాడుతూ తిలక్ కవిత్వంలో తన సైనికుడు ఉత్తరం చాలా ఇష్టమని అప్పటి సైనికుల జీవితాన్ని అది ప్రతిబింబించిందని వివరించారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల అధ్యాపకురాలు నేమాని శారదా మాట్లాడుతూ తిలక్ రచనా విలువలు గుర్తుంచుకోవడం చాలా అవసరమన్నారు. బీవీకే కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ డి.వి.సూర్యరావు మాట్లాడుతూ తిలక్ కథలో తాత్వికతను ఆవిష్కరించారన్నారు. తెలుగు విభాగం సీనియర్ ఆచార్యులు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ ప్రతికవి విమర్శకుడే, ప్రతి విమర్శకుడు కవి కావచ్చు, కాకపోవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరమ్మ డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్ డాక్టర్ సీతారత్నం డాక్టర్ గిరీష్ కుమార్, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

రామారావు స్ఫూర్తితో ‘ఉక్కు’ పరిరక్షణ



వి.వి.రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: ఉక్కు పరిరక్షణకు పోరాట యోధుడు వి.వి.రామారావు స్ఫూర్తితో ముందుకు వెళ్తామని ఉక్కు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారానికి 1267వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఏఐటీయూసీ జాతీయ నాయకుడు వి.వి.రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ పోరాటాలకు రామారావు స్ఫూర్తిని కల్గించేవారన్నారు. ఆయన బాటలో పయనించి విశాఖ ఉక్కును కాపాడుకుంటామన్నారు. కె.సత్యనారాయణరావు, మసేనురావు, డొక్కా నరసింగరావు, కె.రాజబాబు, జి.జయ, డి.దేముడు, కనకరాజు, బీఎంఎల్ నాయుడు, సీతారామరాజు పాల్గొన్నారు.